ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024

రామతీర్థంలో ఘనంగా పందిరి రాట

నెల్లిమర్ల, ఫిబ్రవరి 16: రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 20న జరుగనున్న సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవానికి సంబంధించి దేవస్థానంలో శుక్రవారం ఉదయం పందిరిరాట వేశారు. ఈ తంతును దేవస్థానం ఈవో ఎ.శ్రీనివాసరావు జరిపించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏటా భీష్మ ఏకాదశి నాడు జరిగే సీతారాముల తిరుక్కళ్యాణ మహోత్సవానికి రథసప్తమి నాడు పందిరిరాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. రెండు రోజులు ముందు శివకల్యాణోత్సవం జరుగనుంది. ఇందుకు సంబంధించి కూడా శుక్రవారం ఆలయం వద్ద పందిరిరాట వేశారు.

కబ్జాలపై మాటల తూటాలు

- ముగ్గురు ఎమ్మెల్యేల అక్రమాలపై లోకేశ్ విమర్శనాస్త్రాలు
- శంఖారావానికి విశేషంగా తరలివస్తున్న జిల్లా ప్రజలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాటలు తూటాల్లా పేలుతున్నాయి. జిల్లాలో అధికార పక్షం నేతలపై సంధిస్తున్న విమర్శలు, చలోక్తులు, వంగ్యాస్త్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఆయన ప్రసంగం వినేందుకు శంఖారావం సభలకు ప్రజలు పోటెత్తుతున్నారు. మండు వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలను సైతం వారు లెక్కచేయడం లేదు. చివరి వరకు సభ నుంచి కదిలేదే లేదంటున్నారు. యువత, మహిళలు టీడీపీ కటౌట్లతో కేరింతలు కొడుతున్నారు. లోకేశ్ ప్రసంగానికి మద్దతుగా అడుగడుగునా చప్పట్ల మోత మోగిస్తున్నారు. సభలు జరుగుతున్న ప్రాంతాలన్నీ పసుపుమయం అవుతున్నాయి. జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లతో ప్రత్యేక కళను సంతరించుకుంటున్నాయి. తాజాగా శుక్రవారం జరిగిన మూడు శంఖారావం సభల్లోనూ లోకేశ్ స్థానిక నేతలపై విరుచుకుపడ్డారు. కొండలను దోచుకున్న అప్పలనాయుడు అంటూ నెల్లిమర్ల ఎమ్మెల్యేపై ఆరోపించారు. మైనింగ్ కింగ్‌గా ఆయన కుమారుడు మణిదీప్ కూడా ఎదిగినట్లు పేర్కొన్నారు. రామతీర్థంలో విగ్రహ ధ్వంసం కేసును ప్రస్తావిస్తూ నేటికీ నిందితులను పట్టుకోలేని అసమర్థ ప్రభుత్వంగా విమర్శించారు. ఇక విజయనగరంలో ఎమ్మెల్యే కోలగట్ల రియల్ మాఫియాను ఎలుగెత్తారు. పేదల భూములతో వ్యాపారం చేయడాన్ని దుయ్యబట్టారు. జగనన్న కాలనీల స్థలాల కొనుగోలులో అక్రమాలకు దిగడాన్ని తీవ్ర చర్యగా పేర్కొన్నారు. చివరిగా గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య భూ కబ్జాలను కూడా వివరించారు. గంట్యాడ సభలో లోకేశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 500 ఎకరాలు కొట్టేసినట్లు ఆరోపించారు. ఓ వైపు అధికార పార్టీ నేతల అక్రమాల్ని ప్రస్తావిస్తూ మరోవైపు టీడీపీ అధికారంలోకి వస్తే ఏ మేలు చేస్తుందో వివరించారు. జిల్లా అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులదేనన్నారు.



(నెల్లిమర్ల/ విజయనగరం రూరల్/ గంట్యాడ/ గజపతినగరం)

వార్తలు7లో

24న సుప్రీం జడ్జి, హైకోర్టు చీఫ్ జస్టిస్ బొబ్బిలి రాక

బొబ్బిలి, ఫిబ్రవరి 16: బొబ్బిలి పట్టణంలో నిర్మించనున్న కోర్టు కాంప్లెక్స్ భవనాల శంకుస్థాపన కోసం ఈ నెల 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, యు.దుర్గాప్రసాద్ రానున్నట్లు బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటి గోపాలకృష్ణశర్మ తెలిపారు.



నెల్లిమర్ల సభకు హాజరైన ప్రజలు



విజయనగరం సభకు హాజరైన శ్రేణులు, అభిమానులు

కొండలను దోచుకున్న అప్పలనాయుడు



- మైనింగ్ కింగ్‌గా కుమారుడు మణిదీప్
- విగ్రహ నిందితులను పట్టుకోలేని ప్రభుత్వం
- టీడీపీ నేతలపై కేసులు మోపి ఉక్కుపాదం
- తప్పుడు అధికారులపై చర్యలు తప్పవు
- నెల్లిమర్ల శంఖారావం సభలో యువనేత లోకేశ్

నెల్లిమర్ల, ఫిబ్రవరి16: నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కొండలను పిండి చేసి దోచుకుంటున్నారని.. ఆయన కుమారుడు మణిదీప్ మైనింగ్ కింగ్‌గా ఎదిగారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. నెల్లిమర్లలో శుక్రవారం జరిగిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. స్థానిక ఎమ్మెల్యే, ఆయన కుమారుడు పేద ప్రజల భూములను సైతం దోచుకుంటున్నారని ఆరోపించారు. రామతీర్థంలో రాముడి విగ్రహ ధ్వంసం కేసులో ఇంతవరకూ నింది తులను పట్టుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆ ఘటనను పరిశీలించేందుకు వచ్చిన చంద్రబాబును లారీలతో అడ్డగించిన విషయాన్ని గుర్తుచేశారు. అమాయ కులైన టీడీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదుచేసి చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. 'సూరిబాబు అనే నాయకుడ్ని దారుణంగా హింసించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు ఇబ్బంది పెట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తప్పకుండా తీసుకుంటాం. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం.

భోగాపురం విమానాశ్రయ నిర్వాసితులకు న్యాయం చేస్తాం. సీతమ్మ చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చడంతో పాటు మూతపడిన జూట్‌మిల్లును తెరిపిస్తాం. నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీయే. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు హయాంలో ఎన్నోవిధాలా అభివృద్ధి చేశాం. రూ.1000 కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క పనికూడా పూర్తిచేయలేకపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ జిల్లాకు 50 హామీలిచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, తారకరామతీర్థసాగర్, గోస్తనీ-చంపావతి నదుల అనుసంధానం, పెద్దగెడ్డ ప్రాజెక్టు, పాలేరు నదిపై డ్యాం, సువర్ణముఖి-చిట్టిగెడ్డపై డ్యాం ఇలా ఎన్నో హామీలు ఇచ్చి ఒక్కటీ పూర్తిచేయలేని ఘనత జగన్‌కే దక్కుతుంది. నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ, జనసేన అభ్యర్థిని గెలిపిస్తే సమగ్ర అభివృద్ధికి స్వాగతించిన వారవుతారు. అందుకే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని' విజ్ఞప్తి చేశారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, సీనియర్ నాయకుడు మహంతి చిన్నంనాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవి, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రోతు సత్యనారాయణ, వెంపడాపు సూర్యనారాయణ, ఇజ్జరోతి ఈశ్వరరావు, పసుపులేటి గోపి, అట్టాడ శ్రీధర్, లంక అప్పలనాయుడు, గేదెల రాజారావు, కోటపాటి తిరుపతిరావు,తాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అర్చకుల ఆశీర్వచనాలు తీసుకుంటూ..

కోలగట్లా.. ఇది రియల్ కాదా?

- పేద భూములతో వ్యాపారం చేయడం నిజం కాదా?
- జగనన్న కాలనీల స్థలాల కొనుగోలులో అక్రమాలు
- విజయనగరానికి పోలవరం నీరు అందిస్తాం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 16: 'విజయనగరం ఎమ్మెల్యే పేదలు, రైతుల భూమలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. జగనన్న కాలనీల భూముల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారు. ఎకరం రూ.10 లక్షలకు కొనుగోలు చేసి రూ.38 లక్షలకు అమ్ముకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యుల సామ్రాజ్యంగా విజయనగరాన్ని మార్చేశారు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ప్రశాంతమైన విజయనగరంలో జిల్లాలో అలజడి సృష్టించారని, తద్వారా ప్రయోజనం ఆశించి భంగపడ్డారని ఆరోపించారు. శంఖారావం యాత్రలో భాగంగా శుక్రవారం విజయనగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ఆయన ఉద్వేగపూరితంగా మాట్లాడారు. దేశం, రాష్ట్రం, జిల్లాలో ఎన్నో సేవలు అందించిన మాన్సాస్ సంస్థ విషయంలో ప్రభుత్వం అతి జోక్యం చేసుకుందన్నారు. దీని వెనుక మాన్సాస్ ఆస్తులను కొల్లగొట్టాలన్న ఒకే ఒక్క వ్యూహాన్ని విజయసాయిరెడ్డి రచించారన్నారు. 'నీతి, నిజాయితీలతో ఉండే అశోక్‌గజపతిరాజు కుటుంబానికి న్యాయస్థానం ఊరటనిచ్చింది. న్యాయం గెలిచింది. విజయ సాయిరెడ్డి ఆశలు ఆడియాసలు అయ్యాయి. రామతీర్థంలోని నీలాచలం కొండపై వున్న కోదండరాముని విగ్రహాన్ని ధ్వంసం చేసి మరో అలజడికి తెరతీశారు. ఇంత వరకూ నిందితులను అదుపులోకి తీసుకోలేదు. నాలుగేళ్ల పది నెలల కాలంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు. టీడీపీ హయాంలోనే జిల్లా అభివృద్ధి చెందింది. అధికారంలోకి వచ్చాక విజయనగరానికి పోలవరం నీరు అందిస్తాం. టీడీపీ-జనసేన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టగానే పోలవరంపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. ఉత్తరాంధ్రకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదు. ఉన్న పరిశ్రమలు తరలిపోయినా, పట్టించుకోవడం మానేశారు. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. పేదలు, రైతుల భూములతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారు. ఆయన, కుటుంబ సభ్యుల సామ్రాజ్యంగా విజయనగరాన్ని మార్చేశారు.' అని ఆరోపించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలంతా రానున్న రెండు నెలలు శ్రమించాలని లోకేశ్ పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులదేనన్నారు.



ప్రజలతో ఆడుకున్నారు

- అశోక్‌గజపతిరాజు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో ఆడుకున్నారని టీడీపీ సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు విమర్శించారు. సైకో జగన్ వల్ల రాష్ట్రం వెనుకబడిందని, విజయనగరంలో విచిత్రమైన పరిస్థితి వుందన్నారు. వైసీపీని కాకుండా తనను చూసి ఓటేయాలని ఓ నేత కోరడం వెనుక అంతర్మథనం ఏమిటో ప్రజలు గ్రహించాలన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో ఎన్నో స్కూల్స్ ఎత్తివేశారని, దీనివల్ల ఎంతో మంది నిరుపేద, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమయ్యారన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, విజయనగరం జనసేన సమన్వయకర్త పాలవలస యశస్విని, జనసేన జిల్లా నాయకురాలు లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల వేదికపై ఐక్యతను చాటుతున్న టీడీపీ, జనసేన నాయకులు



విజయనగరం వేదికపై ప్రమాణం చేస్తున్న లోకేశ్, అశోక్‌గజపతిరాజు, అదితి, టీడీపీ-జనసేన నాయకులు

భూకబ్జాల అప్పలనర్సయ్య

- నియోజకవర్గంలో 500 ఎకరాలు కొట్టేశారు
- కుటుంబాలు మధ్య చిచ్చుపెట్టి భూఅక్రమాలు
- మేం అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం
- గంట్యాడ శంఖారావంలో నారా లోకేశ్



గంట్యాడ సభకు హాజరైన మహిళలు

గంట్యాడ/గజపతినగరం, జనవరి 16: గజపతినగరం నియోజకవర్గంలో భూకబ్జాలకు పాల్పడిన ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తన ఇంటి పేరును భూకబ్జాదారుడుగా మార్చుకుంటే మంచిదని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. నిరుపేద కుటుంబాలు మధ్య చిచ్చుపెట్టి నియోజకవర్గంలో దాదాపు 500 ఎకరాలు ఆక్రమించారని ఆరోపించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి గంట్యాడలో సభ నిర్వహించారు. లోకేష్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ అక్రమాలుపై విచారణ చేయిస్తామన్నారు. కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలవరం ఎడమ కాలువ పాత డిజైన్ మార్పు చేసి కొత్తడిజైన్ ఏర్పాటు చేయడం వల్ల గంట్యాడ, బొండపల్లి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇబ్బంది లేకుండా పాత డిజైన్ ఉంచుతామని హామీ ఇచ్చారు. నాగావళి, చంపావతి నదులు అనుసంధానం చేస్తామని, కొండపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు తిరిగి మొదలు పెడతామని చెప్పారు. గజపతినగరాన్ని గంజాయి రహిత నియోజకవర్గంగా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో కేఏ నాయుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు.





అపూర్వ స్వాగతం

- నెల్లిమర్ల నుంచి గంట్యాడ వరకు ఒకటే స్పందన
- ఎల్.కోట మండలం సోంపురంలో లోకేశ్ బస

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర జిల్లాలో మూడో రోజున మరింత ఉత్సాహంగా సాగింది. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి రాత్రి 7.35 గంటల వరకు యాత్ర కొనసాగింది. నెల్లిమర్ల మండలం రామతీర్థంలో ఉదయం 11.10కి మొదటి సభ ప్రారంభమైంది. తరువాత విజయనగరంలోని రింగురోడ్డు ఐస్ ఫ్యాక్టరీ కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహించారు. గంట్యాడలో సభ సాయంత్రం జరిగింది. రాత్రి 7.35 వరకు లోకేశ్ ప్రసంగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్ని సభల్లో పాల్గొనగా నియోజకవర్గ ఇన్‌చార్జిలు కర్రోతు బంగార్రాజు, అదితి గజపతిరాజు, కేఏ నాయుడు అధ్యక్షతన బహిరంగ సదస్సులు నిర్వహించారు. భారీగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు హాజరయ్యారు. లోకేశ్ కొత్త ఉత్సాహంతో ప్రసంగించారు. కొన్ని సందర్భాల్లో ప్రజల నుంచే సమాధానాలు రాబట్టించారు. అధికార పార్టీ నాయకులను. మంత్రులను, ఎమ్మెల్యేలను విమర్శిస్తున్నపుడు ప్రజల నుంచి చప్పట్లతో మద్దతు లభించింది. టీడీపీ-జనసేన సూపర్ సిక్స్ హామీలకు మహిళలు జై కొట్టారు. గంట్యాడ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి సమావేశం ముగిశాక రాత్రి 8గంటల ప్రాంతంలో ఎస్.కోట నియోజకవర్గంలోని ఎల్.కోట మండలం సోంపురం చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. శనివారం ఉదయం 10.30గంటలకు సోంపురం వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం బహిరంగ సదస్సులో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తరువాత విశాఖ జిల్లాకు వెళతారు.



నెల్లిమర్ల సభలో కటౌట్లతో అభిమానులు

శంఖారావానికి విశేష జనాదరణ

- మూడు సభలకు పోటెత్తిన ప్రజలు





(విజయనగరం)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం సభలకు జిల్లా ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. మూడో రోజు కూడా వేలాదిగా తరలివచ్చారు. లోకేశ్ ప్రసంగానికి చప్పట్లతో మద్దతు పలికారు. జిల్లాలో బొబ్బిలిలో మొదలైన యాత్ర శుక్రవారం సాయంత్రానికి గంట్యాడకు చేరుకుంది. చివరిగా శనివారం ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని ఎల్.కోట మండలంలో సభ జరుగనుంది. కాగా లోకేశ్ అన్నిచోట్లా స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావించడం అందరినీ ఆకట్టుకుంటోంది. టీడీపీ హయాంలో ఏం చేశారు? ఇప్పుడు ఏం జరుగుతోందనేది జనం కళ్లకు కట్టారు. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే ఏం చేస్తామనేది కూడా వివరిస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. విజయనగరంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పాలవలస యశస్విని మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా అని జగన్ రెండు నెలల క్రితం ఆట మొదలు పెట్టారన్నారు. ఐదేళ్లుగా ఉత్తరాంధ్రలో రాక్షసుల చర్యలు ఎక్కువయ్యాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన జెండాను ఎగురవేసేందుకు ఇరు పార్టీల క్యాడర్ కలిసి, మెలిసి పనిచేయాలన్నారు. శంఖారావం సభ అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. జనసేన నాయకురాలు లోకం మాధవి, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత తదితరులు పాల్గొన్నారు.

కేరింతలతో మార్మోగిన సభ..

నెల్లిమర్ల: రామతీర్థంలో జరిగిన శంఖారావం సభలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతున్నంతసేపు జనాలు కేరింతలతో చప్పట్లు కొట్టారు. జై కేబీఆర్.. నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

రాముడి విగ్రహం తల నరికిన సైకోలకు కటకటాలు తప్పవు

నెల్లిమర్ల: శంఖారావం సభకు రామతీర్థం విచ్చేసిన లోకేశ్‌ను పలువురు కలిసి తమ బాధలను వెళ్లగక్కారు. మూడేళ్ల కిందట రామతీర్థంలో రాముడి విగ్రహం తలను ధ్వంసం చేశారని చెప్పారు. దీనిపై నిరసన చేపట్టిన స్థానిక నేతలను నెల రోజుల పాటు జైలులో పెట్టారని తెలిపారు. వారిలో ఒక బాధితుడిని చిత్రహింసలకు గురిచేసి నేరాన్ని అంగీకరించేలా బలవంతం చేశారన్నారు. ఆ వ్యక్తి పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న తర్వాత మూడు నెలల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చిందని వివరించారు. దీనిపై స్పందించిన లోకేశ్.. రాముడి విగ్రహం తల నరికిన అరాచక శక్తులను పట్టుకోవడం చేతకాని దద్దమ్మ అమాయకులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. మరో 2 నెలలు ఓపిక పట్టండి, రాముడి తల నరికిన సైకోలతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా ఎక్కడ ఉన్నా లాక్కొచ్చి కటకటాల వెనక్కి పంపుదాం అన్నారు.



నెల్లిమర్ల: వినతిపత్రం ఇస్తున్న బాధితులు

రాక్షస పాలన అంతమొందించేందుకే..



రాక్షస పాలన అంతమొందించేందుకు లోకేశ్ సమర శంఖం పూరించారు. ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్న టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెడుతున్నారు.. అయినా వెనక్కి తగ్గని పార్టీ శ్రేణులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. చంద్రబాబు హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు సేకరిస్తే జగన్ రెచ్చగొట్టారు.. తీరా అధికారంలోకి వచ్చాక నిర్వాసితులకు న్యాయం చేయలేకపోయారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అందిద్దాం.

- కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల ఇన్‌చార్జి

ఈ ఐదేళ్లలో బొత్స ఏంచేశారు?



ఈ ఐదేళ్లలో జిల్లాకు మంత్రి బొత్స సత్యనారాయణ చేసిందేమిటి. జిల్లాలో మద్యం ఏరులుగా పారించిన వ్యక్తి ఆయన. జిల్లాకు తాగునీరు అందిస్తున్న తోటపల్లి ప్రాజెక్టుపై ఒక్కసారైనా సమీక్షించారా..? ఐదేళ్లుగా జిల్లాకు వైసీపీ ఎమ్మెల్యేలు ఏం చేయలేకపోయారు. ఒక్క ప్రాజెక్టునైనా తేలేకపోయారు. వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే. అప్పుడే జిల్లా సమగ్ర అభివృద్ధికి సాధ్యపడుతుంది.

-కిమిడి నాగార్జున, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఎమ్మెల్యే బొత్సను తరిమి కొట్టాలి..



ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అవినీతి అక్రమాలు పెరిగిపోయాయి. వచ్చే ఎన్నికల్లో ఓటుతో జిల్లా నుంచి తరిమి కొట్టాలి. నియోజకవర్గంలో 500 ఎకరాల భూమిని అతి చౌకగా కొట్టేశారు. ఇసుక మైనింగ్, కొండలను సైతం వదలకుండా అవినీతికి పాల్పడ్డారు. ఎమ్మెల్యే.. అక్రమ ఆస్తులపై చర్చకు సిద్ధమేనా..? ఎమ్మెల్యే చేసిన దందాలను త్వరలో ప్రజల ముందుకు తీసుకువచ్చి అవినీతి సొమ్మును ప్రజలకు పంచి పెడతాం.

-కేఏ నాయుడు, టీడీపీ గజపతినగరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే

టీడీపీ, వైసీపీని బేరీజు వేసుకోండి..



టీడీపీ ప్రభుత్వం ఏమి చేసింది? వైసీపీ ఏమి చేసిందన్న విషయం ప్రజలు బేరీజు వేసుకోవాలి. రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన ప్రభుత్వాన్ని గెలిపించాలి. టీడీపీ హయాంలో 12 రోడ్లు ప్రతిపాదించాం. అందులో నాలుగు రోడ్లు పూర్తి చేశాం. దాసన్నపేటలో ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, ట్యాంకు పూర్తి చేస్తే ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ట్యాంకుకు రంగు మార్చి.. తమ ఘనతగా చెప్పుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి.

-అదితి గజపతిరాజు, విజయనగరం ఇన్‌చార్జి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లోకేశ్, టీడీపీ-జనసేన నాయకులు



నెల్లిమర్ల: లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సువ్వాడ రవిశేఖర్



ఐక్యతను చాటుతున్న టీడీపీ, జనసేన నాయకులు

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- జిల్లా వ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్
- మద్దతు తెలిపిన వివిధ సంఘాలు

సంయుక్త కిసాన్‌మోర్చా, అఖిలభారత కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో వారికి మద్దతుగా శుక్రవారం పలు సంఘాలు ర్యాలీలు నిర్వహించాయి. జిల్లాలోని పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి, నినాదాలు చేశారు. సీపీఎం, సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. **-ఆంధ్రజ్యోతి బృందం**



బొబ్బిలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు



ఎస్.కోటలో సీపీఎం మానవహారం



ఎస్.కోటలో సీపీఐ ర్యాలీ



రాజాంలో పలు సంఘాల నిరసన



రాజాం రూరల్: సీఐటీయూ రాస్తారోకో

ఉంగరాడలో చోరీ

రేగిడి: ఉంగరాడలో ఈనెల 13న బి.నాగరాజు ఇంట్లో చోరీ ఘటన చోటు చేసుకుంది. ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో శ్రీకాకుళంలో గృహ ప్రవేశానికి వెళ్లారు. ఆ సమయంలో చోరీ జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఒకటిన్నర తులాల బంగారం, రూ.30 వేల నగదు పోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం క్లూస్ టీం ఘటనా స్థలాన్ని సందర్శించి.. ఆధారాలు సేకరించింది. ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐ ఎస్.శ్రీనివాస రావు, క్లూస్ టీమ్, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: మండలంలోని పుర్లి గ్రామానికి చెందిన వ్యక్తి 40 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ● **భోగాపురం:** అవనాం జంక్షన్ సమీపంలో అక్ర మంగా మద్యం తరలిస్తున్న రావాడ గ్రామానికి చెందిన బత్తుల పైడిరాజును అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. బెల్టు షాపు నిర్వాహ ణ నిమిత్తం మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వ హించి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, పైడిరాజును అరెస్టు చేశామని తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

శృంగవరపుకోట రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మా సొంతింటి కల నిజం చేయండని మండలంలోని వెంకటరమణ పేట, పెద ఖండేపల్లి వాసులు కోరుతున్నారు. మండలంలోని వెంకటర మణపేటలో నివాసానికి అనుకూలం లేని చోట 57మంది ఇళ్ల స్థలా లు కేటాయించారని, దీనిని స్థానికులు వద్దనడంతో వేరే చోట ఇళ్ల స్థ లాలు ఇస్తామని చెప్పి ఇచ్చిన పట్టాలను తిరిగి స్వాధీనం చేసుకుని లే అవుట్ రద్దుచేశార న్నారు. అనంతరం గ్రామానికి పలుమార్లు వచ్చి న ఎమ్మెల్యే మీకు ఇంటిస్థ లం వేరోచోట చూసేశామని ఇచ్చేస్తామని చె ప్పినా ఇప్పటికీ ఎటువంటి స్థలం ఇవ్వలేదన్నారు. పెదఖండేపల్లిలో ఎందుకూ పనికిరాని చోట 18 మంది పేదలకు ఇళ్లస్థలాలు కేటా యించారని, కొండమెట్టపై ఇస్తే తాము ఎలా కట్టుకోగలం అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రఘురాజు వర్గం ఆత్మీయ సమావేశం

శృంగవరపుకోట రూరల్: ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వర్గం సంతగైరమ్మపేట గ్రామాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మీ వెనుక మేము ఉంటాం అని చెప్పారు. దీనిపై రఘురాజు స్పందిస్తు నియోజకవర్గంలో ప్రతిగ్రామం సందర్శించి అందరి అభిప్రాయాలు తీసుకుని ముఖ్యమంత్రికి వివరిస్తామని, అప్పటివరకు వేచి ఉండాలని కోరారు.

చంద్రబాబు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో?

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసగించడమేనని డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ఖజానా తీవ్ర సంక్షోభంలో ఉందని, ఇటువంటి తరుణంలో ఈ ఆరు గ్యారంటీలకు సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చవుతుందని, ఈ నిధులు ఎక్క డి నుంచి తెస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఉన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దును చేర్చాలి

బొబ్బిలి: ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల వారికి మేలు కలిగే విధంగా సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ, జీవో 117 రద్దు వంటి అంశాలను తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని కోరుతూ టీడీపీ, జనసేన నేతలకు వేర్వేరుగా యూటీఎఫ్ నాయకులు శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు. స్థానిక కోటలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన)ను యూటీఎఫ్ నేత కె.విజయగౌరి నాయకత్వంలో నాయకులు కలుసుకొని తమ సమస్యను వివరించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పాలూరు బాబు కూడా సానుకూలంగా స్పందించారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

రాజాం: సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈ జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు కోరారు. శుక్రవారం కంచరాం, మొగులివలస, అంతకాపల్లి తదితర గ్రామాల్లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విజయవాడలో జరిగే నిరసన కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు రావాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 16: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్టీవో రమేష్ సూచించారు. శుక్రవారం రవాణా శాఖ కార్యాలయంలో వాహన దారులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు సీటు బెల్టు ధరించాలని.. లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. జేఎన్‌టీయూలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌రవిశంకర్ ప్రసాద్ అవగాహన సదస్సు నిర్వహించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌టీవో రమేష్

ఘనంగా సీతారాముల కల్యాణం

బాడంగి, ఫిబ్రవరి 16: మండలంలోని కోటిపల్లి గ్రామంలో రామాలయ రెండో వార్షికోత్సవ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని కోటిపల్లి గ్రామ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జాకేరులో పైడితల్లమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో గ్రామ ప్రజల ఆరాధ్యదేవతగా వర్ధిల్లుతున్న పైడితల్లమ్మ అమ్మవారి తీర్థం శుక్ర వారం వైభవంగా సాగింది. ఉదయం 5 గంటల నుంచి అధిక సంఖ్య లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తప్పెడ గుళ్ల బృందం ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఘనంగా రథసప్తమి పూజలు

బొబ్బిలి: పవిత్ర రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని బొబ్బిలి పట్టణం, మండలంలో ప్రత్యక్ష నారాయణుని భక్తి శ్రద్ధలతో పూజించుకున్నారు. మండలంలోని పెంట గ్రామంలో గల వేగావతి నదిలో భక్తులు స్నానమాచరించి సూర్యనమస్కారాలు చేసుకున్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారకులు ధూపం వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

శృంగవరపుకోట: శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులో వున్న శ్రీ సూర్యనారాయణ దేవాలయంలో శుక్రవారం రథసప్తమి పూజలు జరిగాయి. ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు క్యూ కట్టారు. ● **రాజాం:** స్థానిక సంతమార్కెట్‌లో ఉన్న మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివలింగంపై సూర్యకిరణాలు శుక్రవారం ఉదయం 7 గంటలకు తాకాయి రథసప్తమి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సూర్యకిరణాలు శివలింగంపై పడటంతో ఆచ్చర్యానికి గురయ్యారు. ● **గరివిడి:** శ్రీసూర్య సదనం శ్రీవిద్య సౌరశక్తి పీఠంలో సూర్య జయంతి రథ సప్తమి ఉత్సవాలు, పీఠం 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం 5గంటల నుంచి శ్రీసూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకాలు, విశేష ద్రవ్యాలతో 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు.

రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే దుర్మార్గమైన ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు పి.శంకరరావు, బలసా శ్రీను డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించా రు. రామభద్రపురం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చొక్కాపు రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఉపాధ్యాయ నాయకులు

రాజాం: సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరు తూ విజయవాడలో ఈ నెల 18న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఉపాధ్యాయ సంఘాల నాయకులను ముందస్తుగా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిరసన కార్యక్రమానికి హాజరు కావద్దని ఎస్ఐ రవిశేఖర్ హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. వారిలో శ్రీఖర్, డోల వాసు, కుప్పిలి రమేష్, మొయ్యి శ్రీరాములు తదితరులు ఉన్నారు. ● ఏపీసీపీఎస్‌ఈ జిల్లా కార్యదర్శి మొయ్యి శ్రీరాములును శుక్రవారం ముందస్తుగా ఇంటివద్దనే పోలీసులు అరెస్ట్ చేశారు.



పోలీసుల అదుపులో ఉపాధ్యాయులు

విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలి

రాజాం రూరల్: పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు ప్ర తిభను పెంపొందించుకోవాలని బాబా అటమిక్ రీసెర్చి సెంటర్ (బా ర్క్) డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రోజురోజుకూ సాంకే తికత పెరుగుతోందని.. అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వి ద్యార్థులలో మార్పు అవసరమని అన్నారు. స్థానిక జీఎంఆర్‌ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్టైపికాన్ 2024ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్లతో పాటు ప్రాజెక్ట్ డిజైన్ కాంటెస్ట్, హ్యాకథాన్, టెక్నికల్ గేమ్స్, కల్చరల్ ఈవెంట్లను ప్రదర్శించారు.

జాతీయ సదస్సుకు 'గార'

రాజాం: మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని లయోలా కళాశాలలో ఈనెల 21న జరగనున్న జాతీయ సదస్సుకు రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం హాజరుకానున్నారు.

'రాజధాని ఫైల్స్'తో జగన్‌లో వణుకు

లక్కవరపుకోట: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పట్టుకుందని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో రాజధాని ఫైల్స్ సినిమా విడుదల కావడంతో జగన్మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని విమర్శలు గుప్పించారు. రాజధాని భూముల విధ్వంసం సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపారని... దీంతో జగన్ బండారం మొత్తం ప్రజలకు తెలిసిపోయిందని చెప్పారు. సినిమా విడుదల కాకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా న్యాయస్థానం అనుమతి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పాతబొబ్బిలిలో కమిషనర్ పర్యటన

బొబ్బిలి: మున్సిపల్ పరిధిలోని పాత బొబ్బిలి గ్రామంలో శుక్రవారం కమిషనర్ లాలం రామలక్ష్మి పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కడా చెత్తా చెదారాలు, మురుగునీరు నిల్వ ఉండరాదని, అలా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాతబొబ్బిలి జంక్షన్‌లో గల గ్రంథాలయం నిర్వహణ, దాని పనితీరుపై ఆరా తీశారు.

క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన క్రిమినల్ చట్టం సెక్షన్ 106 (1, 2)ని తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయు) అనుబంధ సంస్థ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోట జంక్షన్ నుంచి గంటస్తంభం మీదుగా ఎన్‌సీఎస్, కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్‌వో అనితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్లను క్రిమినల్ కేసులకు బాధ్యులుగా చేయడం అత్యంత కిరాతకమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డి శంకరరావు, శ్రీనివాస్, కరీం, భాస్కర్, నాగేశ్వరరావు, రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన

విజయనగరం దాసన్నపేట: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరు తూ ఏపీ జేఏసీ విజయనగరం ఆధ్వర్యంలో జల వనరుల శాఖ కార్యాలయంలో నిరసన కార్యక్ర మం చేపట్టారు. మ ధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్లు ధరించి...నిరసన తెలి పారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ఉపాధ్యక్షులు డీవీ రమణ, నాయకులు సురేష్, ప్రభూజీ, ఆనంద కుమార్, రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నల్లరిబ్బన్ ధరించిన జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం దాసన్నపేట: రహదారులు, భవనాల శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆర్ అండ్ బీ ఈఈ కె.విజయరత్నం అన్నారు. రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన రమేష్‌నాయుడు కుమార్తె పడాల స్వాతికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, వైఆర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.